మట్టి పరీక్ష.. పంటకు శ్రీరామరక్ష

- భూసార విశ్లేషణకు మట్టి నమూనాల సేకరణ
- భూసార పరీక్ష ఫలితాలతో మోతాదు మేరకు ఎరువుల వినియోగం
- రైతుకు పెట్టుబడి ఆదా



రావులపాలెం మండలం వెదిరేశ్వరంలో మట్టి నమూనాల సేకరణపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఏడీఏ వెంకట రామారావు

కొత్తపేట: పంట చేలకు ఎరువుల మోతాదును నిర్ణయించేందుకు భూసార పరీక్ష ఫలితాల విశ్లేషణ తప్పనిసరి. సాగు చేసే ముందు ప్రతి రైతూ దీనిపై అవగాహన పెంపొందించుకోవాలి. చేలో మట్టి నమూనాల పరీక్షలు విధిగా చేయించుకోవాలి. ఆ ఫలితాల ఆధారంగానే వ్యవసాయ అధికారులు ఎరువుల మోతాదు నిర్ణయిస్తారు. ఫలితంగా సాగుతో పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరిగేందుకు అవకాశం ఉంటుంది. ఈ మట్టి పరీక్ష అటు భూమికి, ఇటు పంటకు శ్రీరామరక్ష అవుతుంది.

వాస్తవానికి 90 శాతం రైతులు పంటకు కావలసిన పోషక విలువలు భూమిలో ఉన్నాయో లేదో తెలుసుకోకుండానే సాగు చేస్తున్నారు. అధిక దిగబడులు సాధించాలనే ఆతృతలో విచ్చలవిడిగా ఎరువులు వినియోగిస్తున్నారు. ఫలితంగా ఖర్చులు పెరుగుతున్నాయి తప్ప ఆశించిన మేరకు దిగుబడులు పెరగడం లేదు. అంతే కాకుండా అధిక మోతాదులో ఎరువులు వేయడం వలన భూమిలో సహజసిద్ధంగా ఉండే పోషకాలు నశించిపోతున్నాయి.

జీపీఎస్ విధానంలో..

వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువస్తూ, రైతులు మెరుగైన దిగుబడులు సాధించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. దీనిలో భాగంగా మోతాదుకు మించి రసాయనిక ఎరువుల వినియోగాన్ని నియంత్రించడంతో పాటు రైతులకు పెట్టుబడి భారం తగ్గించేలా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. భూసార పరీక్షల ఆధారంగా నేలలోని పోషకాలను గుర్తించి, సాగు చేపట్టేలా రైతులను చైతన్యపరుస్తోంది. ఇందుకోసం గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (జీపీఎస్) ద్వారా మట్టి నమూనాలు సేకరించి, భూసార పరీక్షలు నిర్వహిస్తారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ మట్టి నమూనాల సేకరణకు శ్రీకారం చుట్టింది. మండలానికి 50 చొప్పున మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో సుమారు 550 మట్టి నమూనాల సేకరణకు చర్యలు చేపట్టారు. దీనిపై గ్రామ, మండల స్థాయిలో వ్యవసాయ సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. రబీ వరి కోతల అనంతరం ఈ వేసవిలో పూర్తిస్థాయిలో మట్టి నమూనాలు సేకరించనున్నారు. వీటిని సామర్లకోటలోని భూసార పరీక్ష కేంద్రంలో పరీక్షిస్తారు.

నమూనాలు సేకరిస్తారిలా..

చెట్ల నీడ ఉన్నచోట, నీరు పారే బోదెలు, ట్రాక్టర్ లేదా కోత యంత్రాల బాటలు, పెంటకుప్పలు, సేంద్రియ పదార్థాలు, అధిక సారం ఉండేచోట నమూనాలు తీయరాదు. 6.25 ఎకరాల పరిధిని సర్వే నంబర్ల వారీగా గ్రిడ్‌గా నిర్ణయిస్తారు. సాగవుతున్న పంట వేరు వెళ్లేంత వరకూ.. అంటే 15 – 20 సెంటీమీటర్ల లోతు వరకూ ఆంగ్ల అక్షరం 'వి' (V) ఆకారంలో మట్టిని తొలగిస్తారు. అలా తవ్వినచోట అంచుల వెంబడి మెత్తటి మట్టిని గ్రిడ్ మొత్తంలో 8 నుంచి 10 చోట్ల సేకరిస్తారు. దీనిని శుభ్రమైన సంచిపై వేసి నాలుగు సమభాగాలు చేస్తారు. ఎదురెదురు భాగాలు తీసేసి అర కిలో మట్టి వచ్చే వరకూ అదే పద్ధతిలో చేస్తారు. మట్టి నమూనాల సేకరణలో భూ అక్షాంశ, రేఖాంశాలను జీపీఎస్ విధానంలో నమోదు చేయడంతో పాటు భూసార పరీక్ష ఫలితాలను ఆధార్‌కు అనుసంధానం చేస్తారు. తద్వారా ఖరీఫ్‌లో సాయిల్ హెల్త్ కార్డులో సిఫారసు మేరకు రైతులు ఎరువులు వాడుకోవచ్చు.

పంటకు, రైతుకు ఎంతో మేలు



భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల యాజమాన్యంతో పంటలు సాగు చేయడం వలన పంటలకు, రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. భూసార పరీక్ష ద్వారా భూమిలో ఉన్న పోషకాలను బట్టి ఎరువుల మోతాదును పంటలు, సీజన్ల వారీగా నిర్ణయిస్తారు. ఫలితంగా ఆ భూమికి ఎంత మేర ఎరువులు అవసరమో అంతే వినియోగించేందుకు ఈ పరీక్షలు దోహదపడతాయి. దీనివలన రైతులకు పెట్టుబడి తగ్గుతుంది. పంట దిగుబడి పెరుగుతుంది.

– ఎం.వెంకట రామారావు, ఏడీఏ, కొత్తపేట

ధాన్యం ఆర్‌బీకేల్లో విక్రయించాలి



ధాన్యం ట్రాక్టర్‌ను జెండా ఊపి, మిల్లుకు తరలిస్తున్న ఆర్‌డీఓ ముక్కంటి

కొత్తపేట: ధాన్యాన్ని రైతుభరోసా కేంద్రాల (ఆర్‌బీకే) ద్వారా ప్రభుత్వానికి విక్రయించి మద్దతు ధర పొందాలని ఆర్‌డీఓ ఎం.ముక్కంటి సూచించారు. మండలంలో రబీ ధాన్యం కొనుగోలును పలివెలలో గురువారం ఆయన ప్రారంభించారు. మండలంలో దాళ్వా వరి కోతలు, ధాన్యం దిగుబడిపై వ్యవసాయ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. 120 ఎకరాల మేర కోతలు పూర్తి కాగా 48 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉందని వివరించారు. తొలుత పలివెలలో పట్టుబడి పట్టిన ధాన్యానికి ఆర్‌డీఓ ముక్కంటి ట్రక్ షీట్ జనరేట్ చేయించి, రైతుకు అందజేశారు. ఆ ధాన్యం ట్రాక్టరుకు పచ్చ జెండా ఊపి మిల్లుకు తరలించారు. కార్యక్రమంలో ఏఓ పి.పద్మలత, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

మెర్లపాలెంలో..

ఆత్రేయపురం: మెర్లపాలెంలో ఆర్‌డీఓ ముక్కంటి అభివృద్ధి పనులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, నాడు – నేడు పనులను పరిశీలించారు. ధాన్యం కొనుగోలుపై రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాతి బుజ్జి, తహసీల్దార్ అనిల్ కుమార్, వ్యవసాయ శాఖ ఏడీ రామారావు, ఏఓ పట్టాభి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: గొంది గ్రామంలో టీడీపీ అభిమానులు పలువురు గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన కారాడి నరసింహస్వామి, కారాడి వెంకటేశ్వర్లు, కొప్పాడి నరసింహస్వామి, కొప్పాడి ఆంజనేయులు, కొప్పాడి రామాంజనేయులుకు రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు వైఎస్సార్ సీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. నాయకులు తిరుమాని రామకృష్ణ, ఒడుగు వెంకటేష్, రామాడి ఆంజనేయులు, కొప్పాడి నాగేశ్వరరావు, ఒడుగు రంగయ్య ఆధ్వర్యాన ఈ చేరికలు జరిగాయి. పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, ఎంపీటీసీ కొల్లాబత్తుల నాని పాల్గొన్నారు.

అయినవిల్లి చేరిన భీమ్‌జ్యోతి యాత్ర

అయినవిల్లి: సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యాన అంబేడ్కర్ జన్మస్థలం మధ్యప్రదేశ్ నుంచి తీసుకువచ్చిన మట్టి, జ్యోతితో చేపట్టిన భీమ్‌జ్యోతి యాత్ర గురువారం అయినవిల్లి చేరుకుంది. ఐ.పోలవరం, ముమ్మిడివరం మీదుగా మండలంలోని మాగం, సిరిపల్లి మీదుగా ముక్తేశ్వరానికి ఈ యాత్ర చేరింది. సమతా సైనిక్ దళ్ కమాండర్ బొంతు రాజేంద్ర ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వైఎస్ ఎంపీపీ బయ్యా చినబాబు తదితరులు యాత్రకు స్వాగతం పలికారు.

క్రీస్తు సందేశం మానవాళికి మార్గదర్శకం

ఆత్రేయపురం: క్రీస్తు సందేశం ప్రపంచ మానవాళికి మార్గదర్శకమని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆత్రేయపురం పెంతుకోస్తు చర్చి ఆవరణలో పాస్టర్ ఎం.శామ్యూల్ ఆధ్వర్యాన గురువారం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, ఈ చర్చి ఆవరణలో తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే సోమసుందరరెడ్డి విగ్రహం ఏర్పాటు చేసిన దివంగత పాస్టర్ ఎం.వడ్డియ్య చిరస్మరణీయులని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులు సైతం అనాథ శరణాలయం నెలకొల్పి విద్యా, వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ముదునూరి రామరాజు, సర్పంచ్ గాదిరాజు రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొత్తపేట: స్థానిక 33 కేవీ విద్యుత్ లైన్‌లో చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని బిళ్లకుర్రు, వానపల్లి, అవిడి, మోడేకుర్రు, పలివెల, గంటి గ్రామాలతో పాటు కొత్తపేటలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ ఎం.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

సఖినేటిపల్లి: ఉయ్యూరువారి మెరక శివారు కంతేటివారి పోడుకు చెందిన ముంగండ శ్రీదుర్గకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కత్తిమండలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం అందజేశారు. శ్రీదుర్గ చేతికి చేయించుకున్న శస్త్రచికిత్స నిమిత్తం ఈ చెక్కు మంజూరైంది. సర్పంచ్ ఓగూరి రత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

ఆలమూరు: వివిధ గ్రామాల్లోని 20 రైతుభరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీ లావణ్య తెలిపారు. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ, కామన్ రకం ధాన్యాన్ని రూ.1,530కి కొనుగోలు చేస్తారన్నారు. ధాన్యం విక్రయాల్లో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా సత్వరమే సమీప ఆర్‌బీకేలను సంప్రదించాలన్నారు.

అగ్నిప్రమాదాల నివారణ అందరి బాధ్యత

కొత్తపేట: అగ్ని ప్రమాదాల నివారణలో అందరూ బాధ్యతగా వ్యవహరించాలని స్థానిక స్టేషన్ ఫైర్ ఆఫీసర్ (ఎస్‌ఎఫ్‌ఓ) బి.ప్రభాకర రావు అన్నారు. వారం రోజులు పాటు నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లోను, ఫైర్ ఆఫీస్ ప్రాంగణంలోను ప్రజలకు అవగాహన కల్పించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



సీవీ రావును సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

మలికిపురం: ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన ఫొటో ప్రదర్శనలో తృతీయ బహుమతి సాధించిన మలికిపురం మయూరి స్టుడియో అధినేత సీవీ రావును గురువారం ఘనంగా సన్మానించారు. రాజోలు తాలూకా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన స్థానిక పూలే అంబేడ్కర్ భవనంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు కాకర రవితేజ, పండు, స్టాలిన్, తాడి సహదేవ్, నల్లి శ్రీను, జర్నీ కుమార్, వెన్నెల శేఖర్ సుబ్బారావు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమం, సంతోషమే సీఎం జగన్ లక్ష్యం

- ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- మోడేకుర్రులో అభివృద్ధి పథకాలు ప్రారంభం



మోడేకుర్రులో రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబాలకు సంక్షేమం అందించడం ద్వారా ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచి, వారికి శాశ్వతంగా సంతోష జీవనం కల్పించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని అమలాపురం ఎంపీ చింతా అనురాధ, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఎంపీ నిధులు రూ.15 లక్షలతో మోడేకుర్రులో నిర్మించిన సీసీ రోడ్డును, ఓఎన్‌జీసీ నిధులతో ప్రధాన రోడ్డు విస్తరణ పనులను వారు గురువారం ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్ ఆసరా పథకం కింద గ్రామంలోని 159 డ్వాక్రా గ్రూపులకు రూ.5.17 కోట్ల నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎంపీ అనురాధ మాట్లాడుతూ, ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలే ప్రకటించారని, అధికారం చేపట్టిన తరువాత ఆ 9 పథకాలతో పాటు చెప్పని మరో 90 పథకాలు కూడా అమలు చేశారని గుర్తు చేశారు. గతంలో ఏ ప్రభుత్వమైనా ఇన్ని పథకాలు అమలు చేసిందా అనే విషయం ఆలోచించాలని కోరారు. 'ఇంతవరకూ మీ సంక్షేమ కోసం జగనన్న ఎన్నోసార్లు బటన్ నొక్కారు. మీకు బటన్ నొక్కే సమయం వచ్చినప్పుడు మన సంక్షేమ ప్రదాత జగనన్నకు అనుకూలంగా నొక్కి మళ్లీ సీఎంను చేయాలి' అని అనురాధ కోరారు.

ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం ఏరు దాటాక తెప్ప తగలేసిన చందాన పరిపాలన సాగిస్తే, మనందరి ప్రభుత్వంలో హామీ ఇచ్చిన పథకాలతో పాటు ప్రకటించని పథకాలెన్నో అమలు చేశారని అన్నారు. దేశ చరిత్రలోనే ఇంటింటికీ సంక్షేమ లబ్ధి చేకూర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. ఎవరెవరికి ఏయే పథకాలు అందజేశామో ఇంటింటికీ వచ్చి పారదర్శకంగా పేపరుపై చూపిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలే కాకుండా రోడ్లు, డ్రైన్లు, ఇతర అభివృద్ధి పనులు కూడా చేపట్టామని చెప్పారు. మీమీ కుటుంబాలకు చేసిన ఆర్థిక భరోసాకు కృతజ్ఞతగా జగన్‌ను మళ్లీ సీఎంను చేయాల్సిన బాధ్యత మనందరి పైనా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలను సర్పంచ్ రామలక్ష్మి, కుడుపూడి వెంకటేశ్వరరావు దంపతులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, పార్టీ మండల కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, వైస్ ఎంపీపీ దంగేటి వెంకట నాగమణి, ఎంపీడీఓ ఇ.మహేశ్వరరావు, తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు పాల్గొన్నారు.

బడుగుల అభివృద్ధికి సీఎం జగన్ కృషి

- ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- వైఎస్సార్ జగనన్న కాలనీలో గడప గడపకూ..
- అభివృద్ధి పనులకు శ్రీకారం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరు శివారు పెద్ద కాలువ రోడ్డులో ఇటీవల నిర్మించిన వైఎస్సార్ జగనన్న కాలనీ, ఎస్టీ ఏరియాలో గురువారం ఆయన నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, సర్పంచ్ నేలపూడి లావణ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు రావాడ సత్తిబాబు ఆధ్వర్యాన ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రజలు అడిగిన సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగారు. అహర్నిశలూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యులు తోరాటి సీతామహాలక్ష్మి, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, ఎంపీఏఎస్ అధ్యక్షుడు యనమదల నాగేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్లు వనుం సూరిబాబు, శ్రీపతి వీర్రాజు, సొసైటీ చైర్మన్లు నెక్కంటి వెంకట్రాయుడు, మోటుపల్లి వెంకన్న, వీరా రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ జగనన్న కాలనీలో సుమారు రూ.15 లక్షలతో ఏర్పాటు చేసిన మూడు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను జగ్గిరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎస్టీ ఏరియాలో సుమారు రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు.

అపూర్వ స్వాగతం

రాష్ట్రంలోనే తొలిసారిగా వైఎస్సార్ జగనన్న కాలనీ నిర్మించి, రికార్డు స్థాయిలో గృహప్రవేశాలు చేయించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు నేతృత్వంలో మహిళలు అపూర్వ స్వాగతం పలికారు. సీఎం జగన్ ఆడపడచులకు కట్నంగా లక్షలాది రూపాయల విలువైన స్థలంతో పాటు ఇంటిని నిర్మించి కట్నంగా ఇచ్చారంటూ కొనియాడారు. తమ ఇంట్లోకి ఆహ్వానించి అభిమానం చాటుకున్నారు. స్థానిక వైఎస్సార్ జగనన్న కాలనీలో అర్హులైన 355 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. అందులో తొలి దశలో 226 ఇళ్లు నిర్మించిన సీఎం జగన్‌కు, ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, సర్పంచ్‌లు గుణ్ణం రాంబాబు, కట్టా శ్రీనివాస్, పెంటపాటి శ్యామల, చింతపల్లి వెంకటలక్ష్మి, దంగేటి చంద్రకళ, ఎంపీటీసీ సభ్యురాలు ఉన్నమట్ల విజయకుమారి, అమలదాసు అన్నపూర్ణ, కొపనాతి శ్రీనివాస్, నాయుడు ప్రసాద్, దియ్యన పెద కాపు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల ఇఫ్తార్ విందులు



రావులపాలెంలో ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా అందజేస్తున్న విప్ జగ్గిరెడ్డి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి తదితరులు



ఇఫ్తార్ విందులో రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రావులపాలెం/మలికిపురం: ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు గురువారం ముస్లింలకు ఇఫ్తార్ విందులు ఇచ్చారు. కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల ముస్లింలకు రావులపాలెం కాస్మోపాలిటన్ క్లబ్(సీఆర్‌సీ)లో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆధ్వర్యాన ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా కిట్లు అందజేశారు. కార్యక్రమంలో తూర్పు గోదావరి జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎంపీపీ కర్రి లక్ష్మీ వెంకట నాగదేవి, జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు గొల్లపల్లి డేవిడ్‌రాజు, రావులపాలెం ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు. మండల కేంద్రమైన మలికిపురం మసీదులో జరిగిన ఇఫ్తార్ విందులో రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

మామిడికుదురు: పీహెచ్‌సీకి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీపీ కుసుమ వనజకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు కొనిరెడ్డి అంజిబాబు అన్నారు. లూటుకుర్రు పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం జరిగింది. పీహెచ్‌సీకి అవసరమైన పరికరాలను కొలుగోలు చేస్తామన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి అవసరమైన పరికరాల కొనుగోలుతో పాటు వేసవిలో అవసరమైన ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. సమావేశంలో సర్పంచ్ అడబాల తాతకాపు, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, డాక్టర్లు కె.రమ్యశైలజ, స్పందన పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగులకు వినతిపత్రాలు

మామిడికుదురు: ఏపీ జేఏసీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు స్థానిక ఎస్‌బీఐ మేనేజర్‌కు జిల్లా జేఏసీ అధ్యక్షుడు దేవళ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జి.చిరంజీవి, ఇతర ఉద్యోగులు గురువారం వినతిపత్రం సమర్పించారు. బ్యాంకు రుణాలు తీసుకున్న ప్రభుత్వ ఉద్యోగులను, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఈఎంఐల కోసం ఒత్తిడి పెట్టొద్దని, పెనాల్టీలు విధించవద్దని కోరారు. ఎస్‌బీఐ ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

సంక్షేమ పథకాలకు జవాబుదారీగా..



లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: సంక్షేమ పథకాలకు జవాబుదారీతనం వహిస్తూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మాచవరం సచివాలయం–4 పరిధిలో ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి నాగవరపు నాగరాజు ఆధ్వర్యాన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లుగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ పథకాల ద్వారా ఏయే కుటుంబానికి ఎంత మేర మేలు చేకూరిందో వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ విభాగం కన్వీనర్ పేరి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, వైస్ ఎంపీపీలు సూదాబత్తుల లక్ష్మీభార్గవి, నేతల నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు మట్టా పార్వతి, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో ఇళ్ల వద్దకే పథకాలు



ఇంటిపై 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో లబ్ధిదారుల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గొంది గ్రామంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత టీడీపీ, నేటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాల పాలనలో వ్యత్యాసాన్ని ఆయన వివరించారు. నాలుగేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్ వచ్చిన తరువాత పేదలకు, సామాన్యులకు జరుగుతున్న మేలును వివరించారు. లబ్దిదారుల అభిప్రాయాలను ప్రజామద్దతు పుస్తకంలో నమోదు చేసి, వారి ఆమోదంతో వారి ఇంటిపై 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్ అతికించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ మిస్డ్ కాల్ చేయించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొల్లాబత్తుల శుభాకర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

'మానవత్వం' అభినందనీయం

మామిడికుదురు: మానవత్వం స్వచ్ఛంద సేవా సంఘం సేవలు ప్రశంసనీయమైనవని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సంఘం మూడో వార్షికోత్సవం సందర్భంగా స్థానిక సినిమా హాలు ఆవరణలో గురువారం జరిగిన సభకు వ్యవస్థాపకుడు బత్తుల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. సంఘం సమకూర్చిన చీరలను పేదలకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్యకుమార్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, ఎంపీటీసీ వర్ధినేని రాము, పీఏసీఎస్ చైర్మన్ యూవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

అవ్వాతాతలకు కంటి పరీక్షలు

మామిడికుదురు: వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా పెదపట్నంలంకలో గురువారం ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. ఆప్తాల్మిక్ అధికారి మీర్జా హుస్సేన్ ఆధ్వర్యాన 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కంటిశుక్లాల సమస్యతో బాధ పడుతున్న ఆరుగురికి అమలాపురం ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామని చెప్పారు. సర్పంచ్ సుందరనీడి చిన్ని, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య తదితరులు పాల్గొన్నారు.

సుబ్బరాజు సేవలు చిరస్మరణీయం

పి.గన్నవరం: అగ్నికుల క్షత్రియ సేవా సంఘం రాష్ట్ర నాయకుడు పెమ్మాడి సుబ్బరాజు సేవలు చిరస్మరణీయమని నియోజకవర్గ సంఘ అధ్యక్షుడు శేరు శ్రీనుబాబు అన్నారు. సుబ్బరాజు వర్ధంతిని స్థానిక అక్విడెక్టు పార్కులో శ్రీనుబాబు ఆధ్వర్యాన గురువారం నిర్వహించారు. సుబ్బరాజు, అంతర్వేది ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎంపీటీసీ అవనిగడ్డ సత్తిబాబు, నాయకులు పాల్గొన్నారు.

చెత్త సమస్యపై మీకు బాధ్యత లేదా?

ఎంపీడీఓ, ఈఓ, పీఆర్డీలపై ఆర్డీఓ ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ ముక్కంటి. పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: 'మేజర్ పంచాయతీ మాచవరంలో తలెత్తిన చెత్త సమస్యను పరిష్కరించడంలో మీకు బాధ్యత లేదా? మీరు కాక ఎవరు పరిష్కరిస్తారు?' అంటూ ఎంపీడీఓ ఐ.రత్నంరాజు, ఈఓ పీఆర్‌డీ బి.మమతలపై కొత్తపేట ఆర్‌డీఓ ఎం.ముక్కంటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్యపై అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక పెద్దలు, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఇన్‌చార్జి డీపీఓ డి.మధుసూదనరావు, ఆర్‌డీఓ ముక్కంటి గురువారం సమావేశం నిర్వహించారు. చెత్త వేసే ప్రాంతాల్లో అభ్యంతరాలు తెలుపుతున్న హడ్కో కాలనీ, మాచవరం కాలనీ వాసులను సమావేశానికి ఎందుకు పిలవలేదని అధికారులను ఆర్‌డీఓ ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. కాలనీలోని ఇరు వర్గాలతో శుక్రవారం సాయంత్రం సమావేశం నిర్వహించి, సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఒక వారం హడ్కో కాలనీ, మరో వారం మాచవరంలో చెత్తను డంపింగ్ చేసేలా వారితో చర్చించాలన్నారు. ప్రభుత్వ భూములు లేనందున కలెక్టర్ దృష్టిలో పెట్టి, ప్రైవేటు స్థలాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని, అప్పటి వరకూ గ్రామస్తులు, పెద్దలు సహకరించాలని కోరారు. ఇన్‌చార్జి డీపీఓ మధుసూదనరావు మాట్లాడుతూ, మాచవరంలో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రంలో చెత్తను తగలబెట్టకుండా సీసీ కెమెరా, ప్రహరీ నిర్మిద్దామని చెప్పారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, నాగవరపు నాగరాజు, వైస్ ఎంపీపీ సూదాబత్తుల లక్ష్మీభార్గవి, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి పాల్గొన్నారు.